# అమ్మమీది సొమ్ములు

రాఘవ తల్లి చితిమంటలింకా చల్లారనే లేదు. ఆ ఇంట్లో అల్లకల్లోలం మొదలైంది. ఏడుపులు, తూడ్పుల స్థానంలో శాపనార్థాలు మొదలయ్యాయి. శ్మశానవైరాగ్యపు వాతావరణం మాయమై ఆర్థికపరమైన గింజులాట లారంభమయ్యాయి. ముఖ్యంగా ఆ వృద్ధురాలిపై ఉన్న సొమ్ముల విషయంలో ఆ ఇంట్లో యుద్ధ వాతావరణం లాంటిదే ఏర్పడింది. ఎడ చూపులు, పెడ చూపులు, సూటి పోటీ మాటలు నడుస్తున్నాయి. రాఘవ చెల్లెలు సరోజ తల్లిపై ఉన్న సొమ్ములన్నీ తనకే చెందుతాయంటుంది. రాఘవ వాటిని వదిలిపెట్టుకోవడానికి సిద్ధంగా లేడు. ఈ విషయంలో సరోజ, రాఘవ భార్య కమల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత వైరంలాంటిదేర్పడింది. ఇంట్లో ఉన్న బంధువుల నోళ్ళలోనూ ఇదే విషయం నానుతుంది. చుట్టు ప్రక్కల ఇళ్లలో చర్చోప చర్చలు జరుగుతున్నాయి. కొందరు రాఘవను, మరికొందరు సరోజను సమర్థిస్తున్నారు. రాఘవ బావ మధుసూదన్ బావమరిదిపై కారాలు, మిరియాలు నూరుతున్నాడు.

కర్మ కార్యక్రమంలో ఒకటైన పిట్టకు పెట్టి స్నానాలవీ ముగించుకొని ఇంటికొచ్చారు. భోజనాలు చేసి కూర్చున్నారు.

''నేనొక్కదాన్నే ఆడబిడ్డను. మా అమ్మ మీదున్న సొమ్ములన్నీ నాకే రావాలి - ఇది రివాజు... నన్నేడిపించుకోవద్దు...'' ఏడుస్తూ శాపనార్థాలు పెడుతూ అంది సరోజ. భార్య మాటలక వంతపాడాడు మధుసూదన్.

''ముసలమ్మను బాగా అరుసుకున్నావని బంగారమంతా నీకివ్వాలి కదా! మేమే అప్పుల్లో పడున్నాం. ఒక్క పిసరు గూడా నీకిచ్చేది లేదు. ఈమట ఆడబిడ్డట... బంగారమియ్యాన్నట?'' చేతులు తిప్పుతూ వ్యంగ్యంగా అంది కమల.

ఆ మాటలకు గయ్‌మని లేచింది సరోజ.

చేతులను గాల్లో నేలకేసి చరిచినట్టు చేస్తూ, ''బాగకారెడ్డాలాడుతున్నావేంది...? నా ఉసురు తగిలి నాశినమైపోతారు. ఆడబిడ్డనేడ్పించుకున్నవాళ్ళెవరు బాగుపడలేదు'' అని ఏడ్వడం మొదలు పెట్టింది.

''కడుపుల దు:ఖం లేకున్నా ఏడ్పొకటి... ఎవ్వరి నాశనం వాళ్ళెంబడే ఉటుంది. నీ సొమ్మేమైనా తింటేమేం నాశినమైతం. మా సొమ్ము తింటేనువ్వు నాశినమైతవు... కాకులు శాపిస్తే బక్క గొడ్లెం చావయి...'' సరోజకు ధీటుగా జవాబిచ్చింది కమల.

అటు రాఘవ, ఇటు మధుసూదన్ తమ భార్యల పక్షం వహించి మాట్లాడటానికి సిద్ధమవుతున్నారు. అది చూసి రాఘవ మేనమామ చంద్రయ్య లేచి నిల్చున్నాడు.

''మీకేమైనా బుద్ధుందా...? మీరసలు మనుషులేనా...? ముసల్ది పోయి మూడు రోజులన్నా కాలేదు... చావు వాసనైనా పోనింట్లో బంగారం కోసం కుక్కల్లా కొట్లాడుకుంటున్నారు... ఛీ...మీ పుటకలు పాడుగాను...కొంచెమాగుతేం బోతుంది...? పెద్ద కర్మయేమరక్నా ఆగుండ్రి... ఆ తెల్లవారి అన్ని విషయాలు మాట్లాడుకుందాం... ఈలోగా నోరు తెరిస్తే బాగుండదు...'' గద్దించి నట్టన్నాడు.

ఆ మాటలతో అందరు నోళ్ళు మూసుకున్నారు. కర్మయిన తెల్లవారే మాట్లాడుకోవాలని నిర్ణయించుకున్నారు.

అయితే వాళ్ళు ఒకరితో ఒకరు హృదయపూర్వకంగా మాట్లాడుకోవడం లేదు. వాళ్ళ మనసంతా ఆ బంగారం పైన్నే. ఆ బంగారం దక్కించుకోవడానికి తమకు మద్దతుగా మాట్లాడే పెద్ద మనుషులను కూడగట్టుకుంటున్నారు. సరోజ, కమల వృద్ధురాలి మరణం గూర్చి వర్ణిస్తూ పోటీపడి ఏడుస్తున్నారు. మధుసూదన్, ఆతని తరపు వాళ్ళు కర్మకాండ కోసం రాఘవతో వీలైనంత ఎక్కువ ఖర్చు చేయించడానికి ప్రయత్నిస్తున్నారు.

వారం రోజులుగా రాఘవ మనసు రకరకాల సంఘర్షణకు లోనవుతోంది. ఆ సొమ్ముల గూర్చి ఆలోచిస్తూనే అన్ని కార్యక్రమాలూ చేస్తున్నాడు. ఆరోజే పెద్ద కర్మ ముగిసింది. అర్ధరాత్రి వరకు వచ్చిపోయే జనంతోనే సరిపోయింది. మంచంలో నడుం వాల్చాడు రాఘవ. కాని ఎంత ప్రయత్నించినా నిదుర పట్టడం లేదు. తెల్లవారితే సొమ్ముల గూర్చి పంచాయితీ.

' ఆ సొమ్ములు చెల్లెకివ్వాలా? అసలెందు కివ్వాలి? తల్లి మీది సొమ్ములుకూతురుకే చెందుతాయంటారు... కాని ఎప్పుడు...? అవసరాల్లో తల్లి నాదుకున్నప్పుడు. మరి నా చెల్లెలు తల్లి గురించేం పట్టించుకుంది...? సమయానికొచ్చి సొమ్ములు మాత్రం కావాలంటుంది. ఆ సొమ్ముల కోసం చెల్లె ఎంత గొడవ చేస్తుంది...? ఇంట్లో ఎంత అల్లకల్లోలం సృష్టిస్తుంది...? అమ్మ బతికున్నప్పటి నుంచే ఎంతో గందరగోళం చేస్తుంది...''

సొమ్ముల కోసం చెల్లెలు చేసిన పనులన్నీ జ్ఞాపకం వస్తున్నాయి రాఘవకు. నాలుగేళ్ళ క్రితం సరోజ రాఘవ ఇంటికొచ్చింది. అప్పుడామె పదేళ్ళ కూతురు వృద్ధురాలితో, - ''అమ్మమ్మా? నువ్వెప్పుడు చచ్చిపోతావు...? ముసల్దానివైనావుకదా? ఎలాగూ చనిపోయేదానివే... నీ మీదున్న నగలియ్యి నాకు.... కరిగించిరింగులు చేయించుకుంటా... నువ్వు చనిపోయింతర్వాత ఆ నగలు మా అమ్మకే వస్తాయట కదా? అప్పుడైనా అవి నాకే ఇస్తానంది మా అమ్మ...'' అంది.

ఆ మాటలు విన్న వృద్ధురాలు కళ్ళు నీళ్ళు తీసుకుంది. అక్కడున్న వాళ్ళంతా ఆశ్చర్యపోయారు. ఆ అమ్మాయిని కసిరారు. సరోజ మాత్రం కూతురు నొక్కమాట కూడా అనలేదు.

''తొందరగానే చచ్చిపోవాలనుందమ్మా. కాని చావు రావడం లేదు... ఏం చేయాలో చెప్పు? బలవంతంగా ప్రాణం తీసుకోవడం బాగుండదు కదా? ఆ పైవాడు తీసుకెళ్ళేంతవరకు ఉండక తప్పదు. నేను చచ్చిపోయేంతవరకు మీ అమ్మనాగమను...'' మనవరాలిని దగ్గరకు తీసుకొని అందా వృద్ధురాలు.

ఎప్పుడు పుట్టింటి కొచ్చినా తల్లి మీది సొమ్ముల గూర్చే అడుగుతుంది సరోజ. అవి ఎలాగూ తనకే వస్తాయి కాబట్టే అప్పుడే ఇవ్వమంటుంది. ఇవ్వకుంటే శాపనార్థాలు పెడుతూ పోతుంది.

ఓసారి తల్లి జబ్బు పడితే చూడటానికొచ్చింది సరోజ. పండ్లు బ్రెడ్ తెచ్చి తల్లికి తినిపించింది. దగ్గరగా కూచొని ఆప్యాయంగా మాట్లాడింది. తల్లిని సరిగా చూసుకోవడం లేదని వదిన మీద నిష్ఠూరాలాడింది. తెల్లవారితే ఇంటికి పోతాననగా రాత్రి తల్లి ప్రక్కన కూర్చొని ''అమ్మా! నువ్వు త్వరలో చనిపోవడం ఖాయం. ఏం బతికినా కొన్ని రోజులలో... మహా అయితే నెలలో...? మంచంలో పడున్న నీ మీద సొమ్ములుండేంజేస్తాయి...? అవెలాగూ నాకే ఇస్తావు కదా...? నువ్వు చనిపోయింతర్వాత అన్నయ్య, వదిన సొమ్ములు నాకివ్వడానికి కిరి కిరి చేస్తారేమో...? అందుకోసం ఇప్పుడే నాకిచ్చెయి. నువ్వు చనిపోతే ఏడ్చేదాన్ని నేనొక్కదాన్నే కదా..?'' అంది.

చెల్లెలు మాటలు విని అసహ్యించుకున్నాడు రాఘవ. వృద్ధురాలి కళ్ళ వెంట పటపటా నీళ్ళు కారాయి. కొద్ది క్షణాలాగి ఆమె సరోజనతో, ''అవునమ్మా! నేను చస్తే ఏడ్చేదినువ్వే. ఏడ్వడానికి కిరాయి కిందికైనా నాసొమ్ములియ్యమంటావు. అయినా ఎవరేడుస్తారో నేను చూడొస్తానా బిడ్డ... ఇవెలాగూ నీకే... కనీసం నేను చనిపోయేంత వరకైనా నా మీద ఉండనీయి...'' అంది.

తల్లిని తిడుతూ వెళ్ళిపోయింది సరోజ. అన్నా వదినలే తనకివ్వకుండా చేస్తున్నారని వాళ్ళనూ తిట్టింది.

తల్లి బతికున్నప్పుడే ఆ సొమ్మును చేజిక్కించుకోవడానికి సరోజ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. లేవలేని స్థితిలో మంచంలో ఉన్న తల్లి దగ్గరకు రెండునెలల క్రితం వచ్చింది సరోజ. అప్పుడు కూడా సొమ్ముల గూర్చే గొడవ చేసింది. ఇద్దరు పెద్ద మనుషుల సమక్షంలో వాట్ని తీసి పెట్టెలో వేసి తాళం వేసాడు రాఘవ.

'అలాంటి చెల్లెలుకు సొమ్ములివ్వాలా...? తల్లి గూర్చి ఏం బాధ్యత తీసుకుందని ఇవ్వాలి...? ఒకవేళ తన చెల్లెలు తల్లిని బాగా చూసుకుంటే ఆ నగలిచ్చేవాడా తను...? ఏమో...? - తనను తానే రకరకాలుగా ప్రశ్నించుకున్నాడు రాఘవ.

ఊళ్ళోనే ఎలిమెంటరీ టీచరుగా పనిచేస్తున్నరాఘవకు మారు మూల పల్లెటూరుకు బదిలీ అయింది. ఆ సమయంలోనే తల్లికి జబ్బు చేసింది. తల్లిని అక్కడకు తీసుకొని పోయే పరిస్థితి లేదు. పోగా మళ్ళీ ఊళ్ళోకి రావడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు రాఘవ. ఆ సమయంలో తల్లి జబ్బు పడటం అతనికి బాధాకరంగానేంది. అప్పుడే సరోజ, చంద్రయ్య రాఘవ దగ్గరికొచ్చారు.

''అమ్మను తీసుకెళ్ళి కొన్ని రోజులుంచుకో... తర్వాత నేను తీసుకొచ్చు కుంటాను... నాకిప్పుడు వసతి లేదు...'' చెల్లెలితో అన్నాడురాఘవ.

''ఆరోగ్యం మంచిగా లేనిదాన్ని తీసుకుపోయి నేనేం చేసుకోవాలి? ఇప్పుడు బాగా పనులున్న కాలం... నా నుంచి కాదు...'' అంది.

రాఘవ మేనమామ చంద్రయ్య నడిగాడు.

చంద్రయ్య ఆమెను తీసుకెళ్లాడు. అప్పుడు మూడు నాలుగు నెలలా వృద్ధురాలక్కడే ఉంది.

'ఇన్ని జరిగాక కూడా ఆ సొమ్ములు చెల్లెలు కెందుకివ్వాలి? పోగా తన పరిస్థితి కూడా ఏం బాగాలేదు. ఇదువరకే అప్పులున్నాయి. దానికితోడు కర్మ బాగా చేయాలని, ఘనంగా చేయాలని తనతో విపరీతంగా ఖర్చులు పెట్టించారు. తానిప్పుడు మరిన్ని అప్పుల్లో కూరుకుపోయాడు. అమ్మ మీద నాలుగు తులాల బంగారముంది. దాన్ని దృష్టిలో పెట్టుకొనే హాస్పిటల్ ఖర్చులెన్నైనా భరించాడు. మరిప్పుడా

సొమ్ములు చెల్లికివ్వమెలా కుదురుతుంది...?'

రక రకాలుగా ఆలోచిస్తున్నాడు రాఘవ.

ఈ పది రోజులుగానూ, అంతకు ముందు తల్లి మీది నగలను ఆడబిడ్డ కివ్వాల్సిన విషయం గూర్చి కోస్తా మిత్రులను, రాయలసీమ మిత్రులనడిగి వాళ్ళుచెప్పిన విషయాలను జ్ఞాపకం చేసుకున్నాడు రాఘవ.

కోస్తా మిత్రులిలా చెప్పారుః

''మా ప్రాంతంలో తల్లి మీదున్న సొమ్ములు సాధారణంగా కూతురుకే ఇస్తారు. కాని తల్లి బాధ్యతను కొంతైనా స్వీకరించాలి. మా ప్రాంతంలో కూతుర్లిండ్లల్లో తల్లులు చాలా రోజులుండటం జరుగుతుంది. జబ్బు పడిన రోజుల్లోనూ కూతురు చూసుకుంటుంది...''

'తన చెల్లెలు చుట్టపు చూపుగా రావడం, లాంఛనాలనీ తీసుకెళ్ళడమే కాని తల్లి నెప్పుడూ పట్టించుకోలేదు. ఒకవేళ తన తల్లిని పట్టించుకొనున్నా తానా నగలిచ్చేవాడా...?'

'ఎక్కడి ఆచారాలక్కడ' అని తనకు తాను సమాధానం చెప్పుకున్నాడు రాఘవ.

రాయలసీమ మిత్రుడిలా చెప్పాడుః

''మా ప్రాంతంలో తల్లి మీదున్న సొమ్ముల్లో ఆమె తల్లిగారి నుంచి ఆమెకు సంక్రమించినవి మాత్రమే కూతరుకొచ్చే అధికారముంటుంది''

'మరి తన తాతగారి నుంచి వచ్చిన సొమ్ములేమున్నాయి? అమ్మ మీది సొమ్ములన్నీ తన తండ్రిచేయించినవే. ఈ విషయం అమ్మే చెప్పింది. ఆ విధంగా చూసినా ఆ సొమ్ములు తనకేచెందుతాయి. తాను తండ్రి బాధ్యతను స్వీకరించాడు. తండ్రి జబ్బు పడినప్పుడు కూడా చెల్లెలేం పట్టించుకోలేదు. ఆనవాయితీగా తొమ్మిదోరోజు జరిపే 'చిన్నకర్మ' ఖర్చులోకొంత భరించడానికి కూడా గొడవ చేసింది'.

ఎట్టి పరిస్థితిలోనూ చెల్లెలుకా సొమ్ములివ్వ కూడదనే నిర్ణయించుకున్నాడు రాఘవ. తనను తాను సమర్థించుకోవడానికి రక రకాలుగా తర్కించుకున్నాడు. వాదాలను తన కనుకూలంగా మార్చుకున్నాడు. తెల్లవారి పంచాయితీ పెద్దల ముందేం మాట్లాడాలో, భార్యతో ఏం మాట్లాడించాలో రిహార్సల్లా చేసుకున్నాడు. తెల్లవారు జామున నిద్రలోకొరిగాడు.

ఆతడు మేల్కొనే సరికి బారెడు పొద్దెక్కింది.

ఉదయం పది గంటలవుతుంది. ఊరి పెద్దమనుషు లొక్కొక్కరు రాఘవ ఇంటికొస్తున్నారు. ఇంటి ముందే పంచాయితీ. పెద్దలంతా బల్లల మీద, మంచాలపై అరుగుమీద కూర్చున్నారు. కర్మయింతర్వాతనే పోవాల్సిన రాఘవ బంధువుల్లో కొందరు ముఖ్యులు ఈ పంచాయితీ కోసమే ఇంకా ఉన్నారు. రాఘవ, కమల, మధుసూదన్, సరోజ వాకిట్లో పందిరి గుంజల దగ్గర నిల్చొనున్నారు.

చావు వాసనైనా పోనింట్లో అన్నా చెల్లెండ్లు సొమ్ముల కోసం పంచాయితీ పెట్టుకోవడం పెద్ద మనుషుల కసహ్యమనిపిస్తుంది.

వృద్ధుడైన పంచాయితీ మెంబర్ రాంరెడ్డి అందర్నీ చూసి గొంతు సవరించుకున్నాడు.

''విషయం తెల్సిందే... దీన్ని పెద్దగా పొడిగించాల్సిన అవసరంలేదు... మూరెడు పొడుగు రాగం తీసి ఏలెడంతపాట పాడినట్టు గాకుండా దీన్ని త్వరలో ముగిద్దాం. ఇది పెద్ద మనుషుల దాకా రావాల్సింది కాదు. ఇంట్లోనే ఏదో విధంగా చేసుకోవాల్సింది పోయి నలుగుర్లో పడ్డారు. ఉన్న కొద్ది నగ కోసం కుక్కల్లా

కొట్లాడుకుంటున్నారు. మీలో ఎవరికీ ఓపికల్లేవు. మా చెల్లేకదా, తోడబుట్టింది వదలిపెడితేం బోతుందని రాఘవ అనుకోవడం లేదు. అన్న అప్పుల్లో ఉన్నాడు పట్టుబట్టడమెందుకని సరోజ అనుకోవడంలేదు... ఈ విషయం ఏం చేద్దామో చెప్పండి...'' అన్నాడు.

ఆ మాటలనందరూ శ్రద్ధగా విన్నారు.

''ఈ సొమ్ముల కోసం ఇంటి వాతావరణమే మారింది. ఇంట్లో చావు వాసనకు బదులు డబ్బు వాసన మొదలైంది. ఏడుపులు, తూడ్పులకు బదులు తిట్లు, శాపాలు చోటుచేసుకున్నాయి. కలకాలం కలిసుండాల్సిన అన్నాచెల్లెండ్లు తల్లి కాట్నం ఆరకముందే తొగువులాడుకుంటున్నారు. ఈ పది రోజుల్నుంచి, అంతకు ముందుకూడా నగల కోసం జరుగుతున్న ఘర్షణ మనందరికీ తెలుసు. రాఘవా, సరోజా మీకు నేను చెప్పేదొకటే బిడ్డ... డబ్బు శాశ్వతం గాదు... ఈ నగల కోసం మీ మధ్య నున్న సంబంధాలను నాశనం చేసుకోవద్దు...'' అన్నాడు వెంకటేశ్వర్రావు.

రాఘవ కొంచెం ముందుకు జరిగి పెద్ద మనుషులతో, ''మీరంతా కొంచెం శ్రద్ధగా వినండి. అది నాకు చెల్లెలే. కాదనడం లేదు. నాతో రక్తం పంచుకొని పుట్టిందే... కాని, అది మా అమ్మ మీది సొమ్ముల కోసమెంత అమానుషంగా ప్రవర్తించిందో మీకు తెలియదు. మా అమ్మ చావక ముందే ఎలాగూ చస్తావు కదా నగలివ్వమంది. తన కూతురుతోనూ అడిగించింది... సొమ్ముల కోసం మా అమ్మ చావును కోరుకుంది మాచెల్లెలు. చావాలని వేయి కళ్ళతో నెదిరి చూసింది...'' అన్నాడు.

ఆ మాటలు విని ముందుకురి కొచ్చింది సరోజ. చేతులూపుతూ అంది -

''నువ్వేమొ అమ్మను పూవుల్లో పెట్టి సాదినవు. నేనేమొ అమ్మే చావాలని చూసాను? అందుకే కదా అమ్మ చావక ముందే సొమ్ములు తీసి దాచిపెట్టావు. నీ పెండ్లాం, నువ్వు అమ్మ తొందరగా చస్తే సొమ్ములు తీసుకోవచ్చని చూసారు. అందుకే ఈ నాటక మాడుతున్నారు... ఆడబిడ్డ నేడ్పించుకున్నోళ్లెవ్వలు బాగుపడరు...''

''తల్లీ! మేం బాగుపడక పోనియ్... నువ్వే బాగుపడి పెద్దపెద్ద బంగ్లాలు గట్టుకో ఎవరి నాశనం వాళ్ళింబడే ఉంటది...'' అంది కమల.

''ఆగుంల్రిడినీ యవ్వ...'' అని లేచి నిల్చున్నాడు కొండల్‌రావ్.

''ఇన్ని రోజులు ఒకర్నొకరు శపించుకున్నది చాలదా? పెద్ద మనుషుల ముందు కూడా తిట్టుకోవాలా? మీ కారెడ్డాలు, శాపాలు విడిచిపెట్టి అసలు విషయంలోకిరండి. ఈ విషయంలో పట్టు విడుపులుండాలి. సరోజా నువ్వేమంటావో చెప్పు...'' అన్నాడు.

''నేననేదేముంది...? లోకం రివాజు ప్రకారం ఆ సొమ్ములునాకే రావాలి...'' అంది సరోజ.

''అట్లని ఎక్కడేం రాసిలేదు. ఇచ్చే వాళ్ళిస్తారు. లేని వాళ్ళు లేదు. అది వాళ్ళనడుమున్న సబంధాలను బట్టి, శక్తిని బట్టుంటుంది'' అన్నాడు రాఘవ తరపు పెద్ద మనిషొకతను.

''మీరు చెప్పేది బాగానే ఉంది. పెద్ద మనిషని పేరంటం బిలిత్తే ఏదో చేసినట్టుంది మీ కథ. సంబంధాలు, గింబంధాల గూర్చెందుకిక్కడ? ఆడబిడ్డకు రావాల్సిన సొమ్ములు ఖచ్చితంగా మాకు రావాల్సిందే...'' అన్నాడు మధుసూదన్.

''అవును... అవును...'' అన్నారు కొందరు పెద్ద మనుషులు.

''అలా గడ్డి పెట్టండి. మానమస్తది.'' అంది సరోజ.

''సరోజా... మధుసూదన్ ఆ నగల గూర్చి మీరింత పట్టుబడ్తున్నారు కదా? ముసలవ్వకు జబ్బు చేసినప్పుడు మీరేమైనా చేసారా? ఆమె నేనున్నా అరుసుకున్నారా?''

''అట్ల పెట్టండి గడ్డీ...'' అంది కమల.

''ఆడబిడ్డ నేడ్పించుకుంటూ గడ్డీ తినే మనుషులెవరో తెలుస్తూనే ఉంది. అడుసుకునే వరకరుసుకున్నాను. అయినా కొడుకుండగా నాకే మవసర మరుసుకుంటానికి. మూ తల్లి దండ్రుల ఆస్తెవ్వలనుభవిస్తున్నారు..?'' అంది సరోజ.

''అలాంటప్పుడు ఈ సొమ్ములను నీకెందుకివ్వాలి? ఇన్ని రోజులుగా తల్లిని పోషించింది రాఘవ. జబ్బు పడితే దవాఖానల వెంట తిరిగింది రాఘవ. కర్మకాండ ఖర్చులన్నీ భరించింది రాఘవ. తల్లిదండ్రులను పున్నామ నరకం నుండి తప్పించేది కొడుకు. మరి నగలు కొడుక్కి కాకుండా బిడ్డకెందుకివ్వాలి.. ?''

''భలే పెద్ద మనిషివోయ్ కొండయ్య... తల్లి మీదున్న సొమ్ముల మీద బిడ్డకే హక్కుంటుంది. తల్లి చనిపోతే భోరు భోరున ఏడ్చేది కూతుర్లు. కూతుర్లు లేని తల్లి చనిపోయినప్పుడక్కడ పెద్దగా ఏడ్పులు వినిపించడం తక్కువ. తల్లి కోసం ఏడ్చినందుకైనా ఇవ్వాలి...''

''ఏడ్చినందుకు కిరాయికిందికా పటేల నగలివ్వడం...? మనిషి చనిపోతే హృదయ పూర్వకంగా ఏడ్చేవాళ్ళు ఒకరిద్దరున్నా చాలు. మా చెల్లెనగలను దృష్టిలో పెట్టుకొని ఏడ్చుండవచ్చు కాని నగల కోసం ఏడ్చే ఏడ్పు ఏడ్పు కాదు. నేనూ మా చెల్లె కంటెక్కువే ఏడ్చాను. మాచుట్టాలూ, మట్టు ప్రక్కల వాళ్ళూ ఏడ్చారు. మరి వీళ్ళందరికేమివ్వాలి...?''

''నేనట నగల కోసమేడ్చిన్నట... ఈయనేమొ హృదయపూర్వకంగా ఏడ్చిండట... అమ్మ తొందరగా చావాలని చూసింది మీరు...''

''ఆగుండ్రి మీరు... ఒకర్నొకరు తిట్టుకోవడం, దెప్పుకోవడమే కాని సమస్య నెలా పరిష్కరించుకోవాలో ఆలోచించడం లేదు. రాఘవా! ఎందరేడ్చినా కూతురేడ్చినట్టుండదు. తల్లి పోతే బిడ్డకు కడుపులోంచి తన్ను కొస్తుందేడుపు. నువ్వూ హృదయపూర్వకంగానే ఏడ్చావు... కాదనడం లేదు. మన పూర్వులు బాగా ఆలోచించే ముసలివాళ్ళైనా ఆడవాళ్ళమీద కొంతైనా బంగారముండాలన్నారు. దాని కోసమైనా తల్లిని బాగా చూసుకుంటారని, ఏడ్పు రాకున్నా ఏడ్చినట్టైనా చేస్తారని వాళ్ళ ఉద్దేశ్యం... ఈ చరిత్రలన్నీ ఎందుగ్గాని ఈ విషయాన్ని సాగదీయకుండా ఏం చేద్దామో చెప్పండి...'' అన్నాడు రాంరెడ్డి.

''రాఘవా! నువ్వు చదువుకున్నోనివి... మీ బావ చదువుకున్నోడే... మాతోని, చెప్పించుకోవాల్సినఅవసరం మీకు రావద్దు. ఏం చేద్దామో చెప్పు...'' అన్నాడు వెంకటేశ్వర్రావు.

''మా చెల్లెకు, బావకు ఇంతకుముందే చెప్పాను. పెద్ద మనుషుల ముందిప్పుడూ చెబుతున్నాను. నా ఆర్థిక స్థితి బాగుంటే నేనే సొమ్ముల కోసం ఆశించేవాన్నేకాదు... ఇంత తతంగమూ జరిగేది కాదు. నాపిల్లలు చిన్న వాళ్ళు, నాకిదివరకే అప్పులున్నాయి. దానికి తోడు అమ్మ మరణంతో మరో పదివేలప్పు పెరిగింది. ఇవన్నీ భరించడం నా వల్ల కాదు...'' ఇంకా ఏదో చెప్పబోతున్నాడు రాఘవ.

మధ్యలోనే అందుకున్నాడు మధుసూదన్.

''అవన్నీ మా కనవసరం. నీకు కుప్పులుంటే మాకియ్యమనడంలేదు. మాకు చెందాల్సినసొమ్ములను వదిలిపెట్టేది లేదు''

''దయచేసి నన్ను పూర్తిగా చెప్పనివ్వండి. పెద్ద మనుషులంత జాగ్రత్తగా వినండి. సొమ్ముల కోసం గొడవ చేస్తున్న మా చెల్లెలితో స్పష్టంగానే చెప్పాను. మరోసారి మీ అందరి ముందు చెబుతున్నాను. ఈ సొమ్ముల గూర్చి మా చెల్లెం మాట్లాడకుండా ఉంటే నాకు తోచినప్పుడికి అరతులమో, తులమో ఇస్తానన్నాను. మా మధ్య సబంధాలు శాశ్వతంగా ఉంటాయన్నాను. చెల్లిగా నా దగ్గరకు రావచ్చు పోవచ్చు. పండగలకో పబ్బాలకో చీరో, రవికో అందరిలా తీసుకుపోవచ్చు. అలా కాకుండా సొమ్ముల కోసం నాపరిస్థితేం గమనించకుండా పట్టుబడితే మా మధ్య సంబంధాలు శాశ్వతంగా దూరమవుతాయని చెప్పాను. ఇప్పుడూ అదే చెబుతున్నాను. ఇప్పటికైనా మా చెల్లె నా మాట వింటే మంచిదే - ఈ విషయంలో మీరు చెప్పినట్టే వింటాను కానీ మా చెల్లె ముఖం నా జీవితంలో చూడను. ఆమెకు నాతో సంబంధాలే కావాలో, సొమ్ములే కావాలో అడగండి...'' అన్నాడు రాఘవ.

ఆ మాటలు విన్న పెద్ద మనుషుల హృదయాలూ భారమయ్యాయి. కొద్ది క్షణాలెవరూ మాట్లాడలేదు. కొండల్‌రావు సరోజ దిక్కు ప్రశ్నార్థకంగా చూసాడు.

''అబ్బో.. మా అన్న చిన్నోడా? కాలుకు పెడితే మెడకు, మెడకు పెడితే కాలుకు ఒంకె పెడ్తాడు. ఈయనతోని సంబంధలుంటె నాకు చీరెల మీగ చీరలు పెడతడు. ఇదునరకు పెట్టినయి కొద్దా...? మా అమ్మ నాన్నలతోనే నాకీ ఇంటితోని సంబంధం తీరిపోయింది. అయినెనా ముఖం చూస్తే చూడనివ్వు. లేకుంటె లేదు. ఆ సొమ్ములు మాత్రం ఖచ్చితంగా నాకు రావాలె. నేను చచ్చినా వదిలిపెట్టను.''

సరోజ మాటలు విని అంగయా నోళ్ళు తెరిచారు. సొమ్ముల కోసం అన్నతో సంబంధాలను శాశ్వతంగా తెంచుకోవడానికి సిద్ధపడ్డ ఆమె నందరూ ఆశ్చర్యంగా చూసారు. కొద్ది సేపు ఎవరి నోటి నుండీ మాట రాలేదు.

''కాల మహిమ! అన్న అన్నే ... చెల్లె చెల్లే... ఒకర్ని మించొకరు! నా తోడబుట్టింది కదా సొమ్ముల్ని వదిలితేం బోతుందని అన్న అనుకోడు. మా అన్నయ్యే కదా ఎందుకు పట్టుబట్టాలని చెల్లె అనుకోదు. నగల కోసం ఒకరి కొకరు శాశ్వతంగా దూరం కావడానికి కూడా వెనుకాడటం లేదు. ఇదీ ఈ నాటి రక్తసంబంధం'' అన్నాడో పెద్దమనిషి.

''అవునుమరి! లోకమే అలా ఉంది. అన్న దగ్గిరికొస్తే చెల్లెలు కొరిగేదేంటి? పండుగకో పబ్బానికో చీరే, జాకెట్టు. ఒకేసారి సొమ్ములు చేతిలోకొస్తే ఇరవై, ఇరవై ఐదు వేల రూపాయలొస్తాయి. అలాంటప్పుడు అన్నతో సంబంధాలుంటేంది? లేకుంటేంది? సరోజకు... పైగా రాఘవ అంతగా ఉన్నవాడుకాదు, భవిష్యత్తులో సాయమేదైనా అందుతుందని ఆశించడానికి...'' అన్నాడు మరో పెద్దమనిషి.

''పాపం రాఘవ... ఇది భారతకాలమనుకున్నట్టున్నడు. ఇది ధర్మరాజులకాలం కాదు. దుర్యోధనుల కాలం. 'నేను కావాలా? నా మొత్తం సైన్యం కావాలా?' అని కృష్ణుడడుగుతే దుర్యోధనుడు కోరుకున్నదే ఇప్పుడు సరోజ కోరుకుంది...'' అన్నాడు రాఘవ తరపు పెద్దమనిషి.

''రాఘవేం చిన్నోడు కాదులేవోయ్. చెల్లెలేం కోరుకుంటుందో రాఘవకు తెలుసు. అందుకే ఈ మెలిక పెట్టాడు. ఈ సాకుతో చెల్లెలితో సంబంధాలు శాశ్వతంగా తెంపుకోవాలని ప్లాను. రాఘవ తేనె పూసినకత్తిలాంటి వాడు...'' అన్నాడు సరోజ తరపు పెద్ద మనిషి.

''ఇప్పుడు రామాయణాలు, భారతాలు, మనిషి గుణగణాల సంతగెందుకు కాని అసలు విషయానికొద్దాం. తవ్వుకుంటూ పోతే అన్నీ పెంకలే... ఇందులో ఎవరూ తక్కువవాళ్ళు కాదు'' అన్నాడు

కొండల్‌రావు.

''అవును... ఈ మాట కరెక్టు. ఇప్పుడేమంటావో చెప్పు'' రాఘవనుద్దేశించి అన్నాడు ఉప సర్పంచ్.

''అమ్మ నన్నివిధాలా చూసుకుందినేను... ఈ పన్నెండు రోజుల కర్మ ఘనంగా చేయాలని నాతో విపరీతంగా ఖర్చుపెట్టించారు. ఒక్క పెద్దకర్మ రోజే ఐదు యాటలు కోసాను. ఆ సొమ్ములమ్మి అప్పులు తీర్చవచ్చని శక్తికి మించి ఖర్చు చేసాను. ఇప్పుడా సొమ్ముల్ని చెల్లె తీసుకెళ్తానంటే ఎందుకిస్తాను...? అందులోంచి గురిజెత్తు బంగారం కూడా ఇవ్వను...'' అన్నాడు ఖచ్చితంగా రాఘవ.

''నువ్వేందిచ్చేది...? నాకు రావాల్సింది నేనే తీసుకుంటాను. నేనాడదాన్నయి నంత మాత్రాన నా తల్లిదండ్రుల సొమ్ములో భాగం లేదా? ఎక్కువ మాట్లాడితే ఆస్తిలో సగం రావాలని కోర్టు కెళ్తాను...''

సరోజ మాటలకంతా స్తబ్దులయ్యారు. నగల వ్యవహారం చిలికి చిలికి గాలివానయినట్టు ఆస్తుల వరకొచ్చి వాళ్ళమధ్య సంబంధాలను ఘోరాతి ఘోరంగా విధ్వంసం చేస్తుంటే ఏం చేయాలో వాళ్లకు తోచడం లేదు.

రాఘవ ముందుకొచ్చి, ''మా చెల్లె రూల్సు మాట్లాడుతుంది. ఇది కూడా ఒకందుకు మంచిదే... మా నాన్న ఆస్తిలో మా చెల్లెకు ఖచ్చితంగా భాగముంది. అన్నీ మేమిద్దరమూ సమానంగా పంచుకుంటాము. అప్పులు, కుప్పలు, హక్కులు, బాధ్యతలు అన్నీ... మా నాన్న మా చెల్లెలు పెళ్ళి చేయడానికి చేసిన ఖర్చులు, ఇచ్చిన కట్నం, తర్వాతిచ్చిన కట్న కానుకలు, ఆమె ముగ్గురు పిల్లల కాన్పులు చేయడానికైన ఖర్చులు, ఆ పిల్లల పుట్టు వెంట్రుకలు వగైరాలకిచ్చిన కానుకలు, మా ఇంటికొచ్చినపుడు పెట్టిన బట్టలు అన్నీ లెక్క చేద్దాం. నా మీద పెట్టిన ఖర్చూ లెక్కపెడదాం. చెల్లె పంచుకుందామంటుంది కాబట్టి అన్నదమ్ముల్లా పంచుకోవాలి.

''నేను నా తల్లిదండ్రులపై చేసిన ఖర్చు, ఆమె చేసిన ఖర్చు అన్నీ లెక్కపెట్టండి. ఎవరికి ఎక్కువ చెందితే వాళ్ళు తిరిగివ్వాలి. అప్పుడు నాకే ఆమె కొన్ని వేలివ్వాల్సి వస్తుంది. నాన్న ద్వారా నా కొచ్చిన ఆస్తి రెండెకరాలెప్పుడో అమ్ముడు పోయింది. మిగిలింది కూలడానికి సిద్ధంగా ఉన్న ఈ ఇల్లు. దయచేసి ఇవన్నీ లెక్కబెట్టి ఎవరు ఎవరికి తేలుతారో చెప్పండి...'' అన్నాడు.

''నీ కుపాయాలు బాగున్నాయి. నాకు నాన్న పెట్టినవి లెక్క పెడతావా? కాన్పులు చేసింది కూడా లెక్కేనా? నువ్వు నా కన్నవుకావు... నీ పెండ్లాం మాటలు విని మారిపోయావు. ఆడబిడ్డ ఉసురు తగిలి సర్వనాశనమై పోతావు'' అంది సరోజ ముక్కు చీదుతూ.

కమలేదో మాట్లాడబోతుంటే ఆగమన్నాడో పెద్దమనిషి.

''సరోజా! అనవసరంగా నోరెందుకు పారేసుకుంటావు...? మీ అన్న అన్న దాంట్లో తప్పేముంది? ఆడబిడ్డంటే ఆడబిడ్డలాగే ఉండాలి. పుట్టింటి సొమ్ము నాశించడంలో తప్పులేదు. కాని సగం ఆస్తి కావాలన్నప్పుడు అన్నీ సగం కావద్దా... అయినా నీకంటె మీ అన్నకు మీ నాన్న ఆస్తిలో ఏమెక్కువచ్చింది? ఏ ఆడపిల్లకయినా కట్నాలు, కానుకలు, ఇతర ఖర్చుల రూపంలో వాటా కంటెక్కువే ముడుతుంది. చాలా కుటుంబాల్లో ఇలాగే జరుగుతుంది. హక్కులతో పాటు బాధ్యతల గూర్చి కూడా ఆలోచిస్తే మరీ మంచిది...'' అన్నాడు.

ఆ మాటలు విని ముఖం ముడుచుకుంది సరోజ. వాటికి జవాబులు లేవామె దగ్గర.

''అమ్మ మీది నగల కోపమింత భాగోతమా...? నేను కంట నీరు తీస్తే నీకు మంచిదిగాదు.

నువ్వు నాశనమైపోతావు...'' చేతులూపుతూ ఏడుస్తూ రాఘవ నుద్దేశించి అంది సరోజ.

''చెల్లే! నాశనం నాశనమని ఎన్ని సార్లు శాపాలు పెడతావు? మాటలకే బలముంటే నేనెప్పుడో చచ్చిపోయేవాన్ని. నా చావును నువ్వెంత మనస్పూర్తిగా కోరుకుంటున్నావో నాకు తెలియదా? నే నన్యాయం చేస్తే నాశనమే అవుతాను. నీ సొమ్ము తింటే పేరుకే లేకుండా పోతాను... నాశనం చూసి నువ్వు హాయిగా ఉందువు తియ్యి'' అన్నాడు బాధపడుతూ రాఘవ.

''మెత్తటి మాటలతోనే ఇంత దూరమొచ్చింది. ఆమె చెల్లెనట... ఈయన అన్నవట. అన్న నాశనాన్ని కోరుకునేది చెల్లేనా...? ఆడబిడ్డట ఆడబిడ్డ...! నువ్వే సర్వనాశనమైపోతావు... పేరుకు లేకుంటయి పోతావు. నీ ఇంట్ల మన్నుపడ. ముసలామె చచ్చిపోయి పదిహేన్రోజులన్నాకాలేదు... ఇంట్ల ఇంకో పీనుగెల్లాలని చూస్తున్నావా....? పో.. నీ శాపండ్లు నీ ఇంట్ల పెట్టుకో పో...'' కోపంగా అని చేతులెత్తుతూ నేల చరిచింది కమల...

సరోజ, కమల ఇద్దరూ పోటీబడి ముక్కులు చీదుతూ ఏడ్వడం మొదలు పెట్టారు.

వాళ్ళను చూసి, '' ఆగుండ్రి...'' అనిగద్దరించి నవ్వుతని, ''ఆడపుటకలు పాడుగాను. అటు తిట్టుడు బరోబరే... ఇంకో దిక్కు ఏడ్వడం... పిలిస్తే ఉరికస్తయి కండ్లపొంటి నీళ్ళు...'' అన్నాడు రాంరెడ్డి.

ఆ మాటలతో ఏడ్వడం ఆపారు వాళ్ళు.

కొద్ది క్షణాలెవరూ మాట్లాడలేదు. పంచాయతీ పెద్దలు లేచి కొంత దూరం పోయి తమలో తాము మాట్లాడుకున్నారు... ఐదు నిమిషాల్లో తిరిగొచ్చి ఎవరి స్థానాల్లో వాళ్ళు కూర్చున్నారు.

'' అన్నా చెల్లెలిద్దరూ ఒకే ఆకున చదివారు... ఎవ్వరూ ఒకడుగు వెనుకెయ్యాలని కొప్పుకోవడం లేదు. అన్నా చెల్లెల మధ్య సంబంధాలకు మిమ్మల్నే చెప్పుకోవాలి. ఇదెంత డబ్బు కాలమైనా ఆ నగల కొరకు మీరింత దుర్మార్గంగా ప్రవర్తించడం అసహ్యంగా ఉంది. మాకు తోచింది న్యాయమో, అన్యాయమో మేం చెప్పుతాం. మీరిద్దరూ వినాలి...'' అన్నాడు వెంకటేశ్వరరావు.

ఆ మాటలను ఖాతరు చేయకుండా తమకే సొమ్ములు కావాలన్నారు అన్నాచెల్లెల్లిద్దరు.

''అయితే మమ్మల్ని పిలిచిందెందుకు? వెళ్ళిపోతాం...'' అని కోపంగా లేచాడు. ఉపసర్పంచ్. మిగతా వాళ్ళాతన్ని కూర్చోబెట్టారు. ఇద్దర్నీ గద్దరించి పెద్ద మనుషులు చెప్పిన తీర్పుకు ఒప్పుకోవాలని 'ఊ' అనిపించారు.

''నిజానికి తల్లి మీది నగలు ఎవరికి చెందుతాయన్న విషయంలో ఖచ్చితంగా బిడ్డలకో, కొడుకులకో చెందుతాయన్న నియమేం లేదు. ఆయా పరిస్థితులను బట్టి ఉంటుంది. కొందరు కూతురుకే ఇస్తున్నారన్నమాట నిజమే. కాని సరోజ తల్లికి చేతగాని సమయంలో ఆమె బాధ్యతనేమాత్రం తీసుకోలేదు. ఆమె తీసుకున్నా తీసుకోకున్నా రాఘవ ఒప్పుకుంటే పంచాయతే లేదు. కాని తనకు తాను సరిపెట్టుకునే మనస్తత్వం రాఘవకు లేదు. ఈ సొమ్ములు ఇద్దరి మధ్య శత్రుత్వాన్ని పెంచాయి. ప్రస్తుతం ఈ కథ చాలా కుటుంబాల్లో జరుగుతున్నదే. ప్రస్తుతానికి వన్నీ వదిలి పెడుదాం. ఉన్న సొమ్ములను చెరిసగమిచ్చేద్దాం. ఈ తీర్పు మీకిష్టం లేకుంటే తన్నుకచావండి. ఇంతకంటే చేసేదేం లేదు...'' అని అందరి దిక్కూ చూసాడు ఉపసర్పంచ్.

ఆ మాటలకు చాలా మంది ముఖాల్లో ఆమోద ముద్ర కనబడిందతనికి...

''తీర్పు బాగానే ఉంది...''

''అలాగే చెయ్యాలి''

అక్కడున్న వాళ్ళు తలో రకంగా అన్నారు.

అయిష్టంగానే గొణుక్కుంటూనే సరోజ, రాఘవ దాని కొప్పుకున్నారు.

''చెర్లో బర్రెను తోలి కొమ్ములకు బ్యారం చేసినట్టుంది వ్యవహారం. ఇంతకీ ఆ నగలేవీ...?'' అన్నాడో పెద్దమనిషి.

''సందుగలో ఉన్నాయి. తీసుకురండి...'' తాళపు చెవి నుంచుకున్న కుల పెద్ద దిక్కు చూస్తూ అన్నాడు రాఘవ.

ఆ పెద్ద మనిషి, రాఘవ లోపలికెళ్ళి నగలు తీసుకొచ్చి ఉప సర్పంచ్ చేతిలో పెట్టాడు. అక్కడే ఉన్న కంసాలి ఆనందయ్య చేతిలో ఆ నగలుంచి, '' నగలను రెండు భాగాలు చెయ్యాలి... మొత్తం ఎంతయితాయో చెప్పు... ఏ ఒక్కరైనా మొత్తం ఉంచుకోదలుచుకుంటే సగం డబ్బులు రెండో వ్యక్తికిస్తే సరిపోతుంది...'' అన్నాడతను.

ఆనందయ్య వాట్ని అటు తిప్పి, ఇటు తిప్పి చూసాడు. జేబులోంచి కళ్ళజోడు తీసి పెట్టుకొని పరీక్షగా చూసాడు.చేతి మీద రాసుకొని చూసాడు. జేబులోంచి ఆకురాయి తీసి రాకి చూసాడు. అతని కనుబొమ్మలు ముడిపడ్డాయి. కొద్ది నిమిషాలు పరీక్షించి వాట్ని కింద పడేసాడు.

''ఆహోహో... హోహో. .'' అంటూ బిగ్గరగా నవ్వాడు. కొద్ది సేపటికి నవ్వాపుకొని, '' ఉత్త బొక్కలకు కొంగ్రిగాడశపడ్డట్టుంది... ఇవి అసలు బంగారు నగలుకావు .. నకిలీవి...'' అన్నాడు.

ఆ మాటలు విని అందరూ లేచి నిల్చున్నారు. ఆశ్చర్యచకితులై ఆ నగలను చూస్తున్నారు.

కమల, సరోజ శోకాలు మొదలుపెట్టారు.

మధుసూదన్ రాఘవ దిక్కు కోపంగా చూస్తున్నాడు. ఇదెలా జరిగిందో అర్థంకాక రాఘవ బిత్తరపోయి చూస్తున్నాడు.

''నాకియ్యాల్సొత్తుందని అమ్మమీది బంగారమమ్ముకొని నకిలీ నగలు చేయించి పెట్టిండు అన్న... నీవింట్ల పీనుగెల్ల... ఇంతన్యాయ ముంటదా....?'' ఏడుస్తూనే శపిస్తుంది సరోజ.

''యాడాదికింద నువ్వే అమ్మను మీ ఇంటికి తీసుకుపోయి రెండు రోజులుంచుకున్నావు. నువ్వే వాట్ని మార్చినవు. ఏమెరుగనట్టు దొంగేడ్పులేడుస్తున్నావ్..?'' ఏడుస్తూనే అంది కమల.

ఆడవాళ్ళు ఒకరి మీదొకరు మీద మన్నుపడ, దుబ్బపడ అంటూ తిట్టుకుంటున్నారు. చేతులెత్తి శపించుకుంటున్నారు.

తిట్లతో శాపనార్థాలతో పావుగంట సేపు ఎవరేం మాట్లాడిందీ అర్థం కాలేదు. అప్పుడు రంగప్రవేశం చేసాడు రాఘవ మేనమామ చంద్రయ్య... అందర్నీ కూర్చోమన్నాడు.

''మా అక్క మీది నగ అమ్మిందినేను. వాటి స్థానంలో అలాంటివే గిల్టు నగలు చేయించి పెట్టింది నేనే. అని ఏర్పడకుండా ఉండడానికి ఎంతో కష్టపడాల్సివచ్చింది...'' అతి మామూలుగా, నెమ్మదిగా అన్నాడు చంద్రయ్య.

''మా అమ్మనిలా మోసం చేస్తావా...? ఆ డబ్బు కక్కు...'' అంది సరోజ.

''నువ్వేం మనిషివి. మీ అక్కను మోసం చేస్తావా...?'' అంది కమల.

మేనమామ దిక్కు రిమురిమి చూస్తున్నాడు రాఘవ. అతన్ని రకరకాలుగా అంటున్నారక్కడ

ఉన్నవాళ్ళు.

అయినా చంద్రయ్య ముఖంలో ఏ మార్పులేదు అందరి దిక్కు చూస్తూ మెల్ల మెల్లగా అన్నాడు చంద్రయ్య.

''ఐదేళ్ల క్రితమనుకుంటాను, రాఘవ తీసుకెళ్ళమంటే మా అక్కను మా ఇంటికి తీసుకెళ్ళాను. అక్కడామె మరింత జబ్బు పడింది. విపరీతమైనకడుపు నొప్పి. దవాకానలో చేర్పాల్సిన అవసరమేర్పడింది. ఈ విషయాన్ని తెలుపుతూ రాఘవకు లేఖ రాసాను. తనకు వీలుకాదని సన్నేచూసు కొమ్మని ఉత్తరం రాసాడు. డ్యాక్టర్ ఆపరేషన్ చేయందే బతుకదన్నాడు. రాఘవకీ విషయం తెలుపుతూ రాస్తే జవాబు లేదు. ఆలస్యం చేస్తే అక్క బతకదు. ఆమెనడిగి నగలమ్మి ఆపరేషన్ చేయించాను. నగలమ్మగా వచ్చిన డబ్బు పదహారు వేలు. పధ్నాలుగు వేల వరకు హాస్పిటల్ లోనే ఖర్చయ్యాయి. మిగతా రెండు వేలతో అక్కకు బట్టలనీ కొన్నాను. నాలుగు నెలలకు పైగా నా ఖర్చుతోనే ఉంచుకున్నాను రాఘవకు పనితీరకే రాలేదో, వస్తే అమ్మ అనారోగ్యానికి డబ్బివాల్సి వస్తుందనుకున్నాడో మా ఇంటి దిక్కే రాలేదు. లేకుంటేనేనే అన్ని ఖర్చులూ పెట్టుకుంటాననుకున్నాడో...? మా అక్కకు జబ్బు చేస్తే నేను ఖర్చు చేయకూడదని కాదు... కాని నాకా శక్తి లేదు... అందుకే ఆ నగలమ్మాల్సి వచ్చింది... మా అక్క బాగై నేను ఇంట్లో వదిలి పెట్టింతర్వాత కూడా రాఘవ తల్లి ఆరోగ్యం గూర్చి ఒక్క మాటా అడుగలేదు. అడిగితే డబ్బివాల్సి వస్తుందని కాబోలు. ఆమె నక్కడ వదిలిపెట్టి నేను మా ఊరికెళ్ళాను' అని తలవంచుకున్నాడు.

''మరి నకిలీ నగలెందుకు పెట్టినట్టు...?'' అన్నారొకతను.

' ఎంతో మంది జీవితాలను చూస్తున్న నా కిలాంటి పరిస్థితి వస్తుందని తెలుసు... ఆ నగలే లేకుంటే సరోజ పుట్టింటికొచ్చినప్పుడల్లా తల్లికి అరటిపళ్ళు, తీపి పదార్థాల లాంటివి తెచ్చేదా...? దగ్గర కూర్చొని ఆప్యాయంగా మాట్లాడుతూ తినిపించేదా? ఆ నగలే లేకుంటే రాఘవ తల్లి కర్మనంత ఘనంగా చేసేవాడా...? ఇంకా... ఇంకా ... కమల... ఎన్నో పనులా నగలు చేయించాయి. అవి నకిలీ నగలని ఎట్టిపరిస్థితిలోనూ చెప్పవద్దని మా అక్కకు చెప్పాను. ఆమె ఆ రహస్యాన్నలాగే కాపాడింది''

అక్కడున్న వాళ్ళంతా చంద్రయ్య మాటలను స్థాణువులై వింటున్నారు. రాఘవ, సరోజ ముఖాల్లో కత్తివేటుకు నెత్తురు చుక్క లేదు. వాళ్ళహృదయాలు కళా పెళా కాగుతున్నాయి.

అంతరంగాలను బయటకు లాగి మానవ సంబంధాలను తుత్తునియలు చేసిన ఆ సొమ్ములు మనుషులను చూస్తూ వికటాట్టహాసం చేస్తున్నట్లున్నాయి.

అవి అక్కడున్న పెద్ద మనుషులకు మాత్రం కాళకూట గరళాన్ని కడుపులో దాచుకున్న విషం కక్కే భుజంగాల్లా కనబడుతున్నాయి.

*రచన మాసపత్రిక డిసెంబర్ '94*

కథాసాగర్ (కళాసాగర్‌వారి) కథా సంకలనంలోంచి

# విప్లవ వాదం

